క్లుప్తంగా

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: పారిశుధ్య కార్మికుల సేవలు ప్రశంసనీయమని జనసేన జిల్లా అధ్యక్షుడు, శాసనమండలి మాజీ సభ్యుడు కందుల దుర్గేష్ అన్నారు. హుకుంపేట మాజీ ఉప సర్పంచ్, జనసేన రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణ కమిటీ కన్వీనర్ చిక్కాల వీర వెంకట రమణ (బాబులు), కుటుంబ సభ్యుల సహకారంతో గ్రామంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సిబ్బందికి శనివారం దుస్తులు, స్వీట్లు పంపిణీ చేశారు.

వైభవంగా సుబ్రహ్మణ్య హోమం



హోమం నిర్వహిస్తున్న భరద్వాజశర్మ

రాజమహేంద్రవరం రూరల్: రాయుడుపాకలు గ్రామంలో భరద్వాజశర్మ ఆధ్వర్యంలో శనివారం కృత్తికా నక్షత్ర సుబ్రహ్మణ్య హోమం వైభవంగా జరిగింది. రెండేళ్లుగా ప్రతినెలా కృత్తికా నక్షత్రంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ హోమం చేయడం వల్ల అనేక సమస్యల నుంచి పరిష్కారం లభిస్తుందని భరద్వాజశర్మ తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

కడియం: కడియపులంక లోకల్ ఫీడర్ల వార్షిక మరమ్మత్తుల నేపథ్యంలో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. ఈ కారణంగా కడియపులంక, బుర్రిలంక, వెంకాయమ్మపేట, దోసాలమ్మ కాలనీలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైఎస్సార్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ మృతి



వెంకటేశ్వరరావు (ఫైల్)

సీటీఆర్ఐ: వైఎస్సార్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పడాల పెద్ది వెంకటేశ్వరరావు శనివారం మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ట్రస్ట్ వైస్ చైర్మన్ అడపా రాజు మాట్లాడుతూ వెంకటేశ్వరరావు వైఎస్సార్ ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు. కోటగుమ్మ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన తీసుకురావడమే కాకుండా, విగ్రహ నిర్మాణం చేపట్టే వరకూ అన్ని విధాలా సహకారం అందించారన్నారు.

శిక్షణ తరగతులు

ప్రకాశం నగర్: అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం గోకవరం బస్టాండ్ వద్ద గల విక్రమహాలులో జిల్లా నాయకత్వానికి శిక్షణ తరగతులు నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ మాణిక్యాంబ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించగా, మాజీ ఎంపీ మీడియం బాబురావు శాస్త్రీ ఆలోచన పాఠాన్ని బోధించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ మాట్లాడుతూ కార్మికులు, రాజకీయాలు అనే విషయాలను వివరించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.బేబీ రాణి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ పాల్గొన్నారు.

మహిళల ఆందోళన

కడియం: వేమగిరి పంచాయతీ పరిధిలోని జగనన్న1 లేఅవుట్‌లో తమకు పట్టాలు ఇచ్చి, ఇళ్ల స్థలాలు చూపించడం లేదంటూ వేమగిరి, కడియపుసావరం గ్రామాలకు చెందిన లబ్ధిదారులు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. సుమారు 850 మందికి అక్కడ స్థలాలు కేటాయించారు. అయితే అప్పట్లో చదును పనులు చేపట్టిన కాంట్రాక్టర్ సక్రమంగా పనులు చేపట్టలేదు. ఈ నేపథ్యంలో వీరికి ప్లాట్లు కేటాయించడానికి ఆలస్యమవుతోంది. తహసీల్దార్ రమాదేవి వారిని పిలిచి మాట్లాడడంతో తాత్కాలికంగా నిరసన విరమించారు. అక్కడి నుంచి కలెక్టరేట్‌కు బయలుదేరి వెళ్లారు.

క్వారీ గోతుల్లో పడి వ్యక్తి మృతి

కంబాలచెరువు: క్వారీ గోతుల్లో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. సుబ్బారావు నగర్‌కు చెందిన తుమ్మల లోవరాజు (26) భవన నిర్మాణ పనులు చేస్తుంటాడు. అతడు ఈనెల 15వ తేదీ నుంచి కనిపించడం లేదు. దీనిపై లోవరాజు తల్లిదండ్రులు సూర్యచక్రవర్తి, లక్ష్మి స్థానిక మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే లోవరాజు క్వారీ గోతుల్లో శవమై కనిపించడంతో విషయాన్ని స్థానికులు పోలీసులకు తెలిపారు. వారు వచ్చి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లోవరాజు కాలుజారి క్వారీ గోతుల్లో పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే వైఎస్సార్ సీపీ నాయకుడు మాసా రామ్‌జోగి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి కుటుంబానికి ఆ క్వారీ యజమానులు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

అక్కచెల్లెమ్మల సొంతింటి కల సాకారం

- రాష్ట్రంలో జగన్ ఆదర్శ పాలన
- టిడ్కో ఇళ్ల పంపిణీలో మంత్రి వేణు
- పాల్గొన్న ఎంపీ భరత్ రామ్



హుకుంపేట డి బ్లాక్‌లో టిడ్కో గృహాల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి వేణు, చిత్రంలో ఎంపీ భరత్‌రామ్, గూడూరి శ్రీనివాస్, రౌతు సూర్యప్రకాశరావు

రాజమహేంద్రవరం రూరల్ : రాష్ట్రంలో 31 లక్షల మంది అర్హులైన అక్కచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలను అందించి, సొంతింటి కలను నెరవేర్చిన మనసున్న ప్రజానేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ఎంపీ, సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్ రామ్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, పార్లమెంట్ నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులతో కలిసి శనివారం హుక్కుంపేట డి బ్లాక్‌లో 224 టిడ్కో గృహాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

సొంతగూడు కల్పించడమే లక్ష్యం

మంత్రి వేణు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ సొంత గూడు కల్పించడమే లక్ష్యంగా సీఎం జగన్ పనిచేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ పాలకులు టిడ్కో ఇళ్లను అసంపూర్తిగా నిర్మించి, మౌలిక సదుపాయాలు కల్పించకుండా వదిలేశారన్నారు. జగన్ సీఎం అయిన తర్వాత వాటిలో అన్ని వసతులు కల్పించి, అక్కచెల్లెమ్మలకు అందిస్తున్నారన్నారు. వలంటర్, సచివాలయ వ్యవస్థలను ప్రవేశపెట్టి గ్రామస్థాయిలోనే ప్రభుత్వ పథకాల లబ్ధిని అందిస్తున్న ఏకైక నాయకుడు సీఎం జగన్ అన్నారు. రాష్ట్రంలో పేద పిల్లలందరూ ఉన్నత విద్యను అభ్యసించి, సమాజంలో సముచిత స్థానాన్ని పొందాలన్నదే ఆయన సంకల్పమన్నారు. తండ్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి.. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.2.5 లక్షల ఖరీదైన వైద్యాన్ని పేదలకు అందిస్తే, నేడు ఆయన తనయుడు సీఎం జగన్ దానిని రూ.25 లక్షలకు పెంచి, ప్రజల ఆరోగ్య భద్రతకు భరోసా కల్పించారన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ టిడ్కో లబ్ధిదారుల ముఖాలలో ఆనందం చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉందన్నారు. కొన్ని చోట్ల సాంకేతిక ఇబ్బందులు, మరికొన్ని చోట్ల ప్రతిపక్ష నేతలు సృష్టించిన అడ్డంకులను అధిగమిస్తూ ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి సర్వం సిద్ధం చేస్తున్నామన్నారు. అందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి తీరతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్ఎంసీ ఏడీసీ సత్యవేణి, వైఎస్సార్ సీపీ నాయకులు సంకిస భవానీప్రియ పాల్గొన్నారు.

సత్యదేవ నర్సరీ సందర్శన



సత్యదేవ నర్సరీలో గుంటూరు విద్యార్థులు

కడియం: గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాల బీఎస్సీ సెకెండ్ ఇయర్ విద్యార్థులు, అధ్యాపకుల బృందం శనివారం కడియపులంకలోని శ్రీ సత్యదేవ నర్సరీని సందర్శించింది. ఫీల్డ్ విజిట్‌లో భాగంగా విచ్చేసిన వారికి నర్సరీ రైతు పుల్లా పెద సత్యనారాయణ సాదర స్వాగతం పలికారు. మండల వ్యవసాయాధికారి కె.ద్వారకాదేవి, ఉద్యానాధికారి డి.సుధీర్‌కుమార్ కడియం ప్రాంత నర్సరీలు, వాటిలో ఉత్పత్తి చేసే మొక్కల వివరాలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో తిరువీధి ఉత్సవం



స్వామి వారిని ఊరేగిస్తున్న ఆలయ అర్చకులు

సీటీఆర్ఐ: స్థానిక కోరుకొండ రోడ్డులోని సింహాచల నగర్ శ్రీ వరహాలక్ష్మీ నృసింహస్వామి క్షేత్రంలో మదుభయ వేదాన్తాచార్య పీఠం ట్రస్టు, శ్రీరంగం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న 22వ వార్షిక చందన యాత్ర మహోత్సవాలలో భాగంగా శనివారం సాయంత్రం తిరువీధి (గరుడ సేవ) ఉత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్తలు కాలెపు సూర్య సింహాచలం, కాలెపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు అవసరాల శ్రీకిరణ్ స్వామి పర్యవేక్షణలో ఆలయం నుంచి మొదలైన గరుడ సేవ.. మేళతాళాలు, బాణసంచా కాల్పులతో కోలాహలంగా సాగింది. కంబాల చెరువు, దేవీచౌక్, కోటగుమ్మం, మెయిన్ రోడ్డు, భారత బొమ్మలు, జాంపేట మీదుగా ఆలయానికి చేరింది. కాగా.. ఉదయం సంతాన సాఫల్యం కోసం గరుడ ప్రసాద వితరణ చేశారు. ఆదివారం సాయంత్రం తిరుకల్యాణ మహోత్సవం, సోమవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ నిజరూప దర్శన సేవ జరుగుతుంది.

ఆర్ట్స్ కళాశాలలో అంతర్జాతీయ వెబినార్

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో లాంగ్వేజ్ ఈజ్ యాక్షన్ ది కీ టు కమ్యునికేషన్ అనే అంశంపై శనివారం అంతర్జాతీయ వెబినార్ జరిగింది. యూఎస్ఏ మిల్ వాక్ పబ్లిక్ స్కూలు నుంచి డాక్టర్ అమిత్ రూత్‌గానె, హైదరాబాద్ వాసవీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ నుంచి డాక్టర్ కె.ఝాన్సీ రిసోర్స్‌పర్సన్లుగా వ్యవహరించారు. విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలను పెంపొందించేందుకు పాఠ్య పుస్తకాలను ఎలా వినియోగించాలో డాక్టర్ అమిత్ వివరించారు. భాషా సామర్థ్యాన్ని పెంచడానికి స్పీకింగ్, లిజనింగ్ నైపుణ్యాలను డాక్టర్ కె.ఝాన్సీ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ ఆంగ్ల నైపుణ్యాలను పెంపొందించడానికి కమిషనరేట్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ తీసుకున్న కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.

రాజమహేంద్రవరంలో అభివృద్ధి పరుగులు

- నా సేవలు నచ్చితే ఓటు వేయండి
- 44వ డివిజన్ పర్యటనలో ఎంపీ భరత్‌రామ్



ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని, తాను చేసిన సేవలు నచ్చితే ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ కోరారు. స్థానిక 44వ వార్డు పీ అండ్ టీ కాలనీ శ్రీనివాస్ కాన్వెంట్ సెంటర్ నుంచి శనివారం గుడ్ మార్నింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ ఆయా ప్రాంతాల్లోని ప్రజలు, చిరు వ్యాపారులతో ముచ్చటించారు. స్థానిక సమస్యలేమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఒకచోట పుంత రోడ్డు చివరిలో కాలువ ఉండటంతో రోడ్డుపైకి వెళ్లేందుకు చాలా ఇబ్బందిగా ఉందని పలువురు ఎంపీకి తెలిపారు. స్పందించిన ఆయన వెంటనే ఆర్ఎంసీ సిబ్బంది దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లారు.

రూ.400 కోట్లతో అభివృద్ధి పనులు

ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ ప్రజలు తనపై నమ్మకంతో ఎంపీగా గెలిపించారని, అందుకు తగ్గట్టు పూర్తిస్థాయిలో న్యాయం చేశాననే ఆత్మ సంతృప్తి తనకు ఉందన్నారు. కేవలం రూ.400 కోట్లతో నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశానని తెలిపారు. మోరంపూడి ఫ్లై ఓవర్ బ్రిడ్జి మరో రెండు నెలల్లో పూర్తవుతుందని, పార్కులు, జంక్షన్లు, రోడ్లు, డివైడర్లు, పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దామన్నారు. ఎయిర్ పోర్ట్ టెర్మినల్ బిల్డింగ్ అభివృద్ధికి రూ.350 కోట్లు, రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.300 కోట్లు మంజూరయ్యాయన్నారు.

కేంద్రం పరిశీలనలో కొత్త వంతెన

గోదావరిపై మరో కొత్త వంతెనకు ప్రతిపాదన పంపగా కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉందని ఎంపీ భరత్‌రామ్ తెలిపారు. జాతీయ రహదారిపై మరో అయిదారు ఎఫ్ఓబీలు వస్తాయని, ఔటర్ రింగ్ రోడ్ రాబోతోందని చెప్పారు. రైల్వే స్టేషనులో 4, 5 ప్లాట్‌ఫాంలు పూర్తయ్యాయని, 6వ ప్లాట్‌ఫాం కూడా రానుందని వెల్లడించారు. గోదావరి ఘాట్‌ను హైదరాబాద్ ట్యాంక్‌బండ్ తరహాలో అభివృద్ధి చేస్తానని తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలలో రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానన్నారు. తాను చేసిన అభివృద్ధి నచ్చితే ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, వైఎస్సార్ సీపీ నాయకుడు అజ్జరపు వాసు, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, క్లస్టర్ ఇన్‌చార్జి అప్పారావు, కొమ్మోజు జిగ్లర్, హసీనా బేగం పాల్గొన్నారు.

22న మహాలక్ష్మి అమ్మవారికి మహా అర్చన

- 450 కేజీల పసుపు, కుంకుమతో పూజలు
- పోస్టర్ ఆవిష్కరించిన చిన్న వెంకన్నబాబు స్వామీజీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చిన్న వెంకన్నబాబు స్వామీజీ తదితరులు

సీటీఆర్ఐ: గాడాలలోని మహాలక్ష్మీ సమేత చిన్న వేంకటేశ్వరస్వామి పీఠంలో కొలువైన మహాలక్ష్మి అమ్మవారికి ఈనెల 22వ తేదీన 450 కేజీల పసుపు, కుంకుమలతో మహా అర్చన నిర్వహిస్తున్నామని పీఠాధిపతి డాక్టర్ చిన్న వెంకన్నబాబు స్వామీజీ తెలిపారు. దానవాయిపేటలో శనివారం జరిగిన సమావేశంలో ఆ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ముదునూరి వెంకటలక్ష్మి తదితరులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకన్నబాబు మాట్లాడుతూ మహాలక్ష్మిని స్మరించడం వల్ల అష్టైశ్వర్యాలతో పాటు సర్వకార్యసిద్ధి ప్రాప్తిస్తుందన్నారు. దుర్గమ్మ స్మరణతో శత్రుభయం నశించి, సర్వఫలాలు కలుగుతాయన్నారు. అందుచేతనే మహాలక్ష్మి, దుర్గమ్మల మూల మంత్రాలతో 450 కేజీల పసుపు, కుంకుమలతో మహా అర్చన చేస్తున్నామని వివరించారు. 22వ తేదీ ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పూజ చేస్తామని, అనంతరం పసుపు, కుంకుమలను భక్తులకు అమ్మవారి ప్రసాదంగా అందజేస్తామన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతూ జరిగే పదో తరగతి, ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులకు అమ్మవారి దగ్గర ప్రత్యేక పూజలు చేసిన 3,000 పెన్నులను త్వరలోనే పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సుమేధ వెంకటరాజు, భాష్యం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.రవికుమార్ , వేగిశన శ్రీనివాసరాజు, మనగుడి - మనసేవ భారతీయ ఆధ్యాత్మిక సేవాసమితి జాతీయ కార్యదర్శి మద్ది శ్రీనివాసరెడ్డి, ఉభయ రాష్ట్రాల చైర్మన్ మతల రమేష్, రాష్ట్ర చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, పూర్ణిమ పాల్గొన్నారు.

రేపటి నుంచి సీపీఎం 'ప్రజానిధి సేకరణ'



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అరుణ్ తదితరులు

ప్రకాశం నగర్: సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నుంచి జరగనున్న ప్రజానిధి సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి టి.అరుణ్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీని వ్యతిరేకించే పార్టీలకు తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బీజేపీతో జతకట్టిన పార్టీలకు బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి, హక్కులను హరించిందని విమర్శించారు. అంతర్జాతీయంగా గ్యాస్, పెట్రోల్ ధరలు తగ్గినప్పటికీ దేశంలో ధరలు తగ్గించలేదన్నారు. 20న విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఎలక్ట్రోరల్ బ్యాండ్లను రద్దు చేయాలని సుప్రీం కోర్టు ఆదేశాలివ్వడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అనంతరం సీపీఎం ప్రజానిధి పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో పార్టీ నగర కార్యదర్శి బి.పవన్, జిల్లా నాయకుడు ఎస్ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పదవులు అధిరోహించాలి



ఆరిఫ్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ప్రకాశం నగర్: వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు మహ్మద్ ఆరిఫ్ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని జిల్లా మొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు ఆకాంక్షించారు. ఈ మేరకు శనివారం ఆరిఫ్‌ను ఆయన కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. తమ కమిటీకి గౌరవ అధ్యక్షుడిగా ఉన్న ఆరిఫ్ మైనార్టీల సంక్షేమానికి మరింత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు హైటెక్ గోపాల్, దేవీ మొబైల్స్ ప్రసాద్, నాలి హేమంత్, పీవీవీ రాజేష్, లలితాంబికా రాజేష్, జఫ్రుల్లా, భార్గవ్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో రెండు మృతదేహాల గుర్తింపు





ప్రకాశం నగర్: రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంలపై రెండు మృతదేహాలను రైల్వే పోలీసులు గుర్తించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. 4 – 5 ప్లాట్‌ఫాంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. అతడి వయసు సుమారు 50 నుంచి 55 ఏళ్లు ఉంటుంది. సిమెంట్ కలర్ చొక్కా, గ్రీన్ కలర్ పూల పంచి ధరించి ఉన్నాడు. అతడు ఆహారం లేకగానీ, అనారోగ్యంతో గానీ చనిపోయినట్లు భావిస్తున్నారు. అలాగే ప్లాట్‌ఫాం – 1పై మరుగుదొడ్డి వద్ద మరో వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. అతడి వయసు సుమారు 40 నుంచి 45 ఏళ్లు ఉంటాయి. పసుపుగళ్ల చొక్కా, నీలం ప్యాంట్ ధరించాడు. అనారోగ్యంతో చనిపోయినట్టు భావిస్తున్నారు. ఈ మేరకు జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుల వివరాలు తెలిసిన వారు జీఆర్‌పీఎస్ 0883 2442821, ఎస్సై లోవరాజు 94914 44022 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ముగిసిన యోగా తరగతులు



యోగా గురువును సత్కరిస్తున్న బళ్లా సత్యవతి, శ్రీనివాస్

కంబాలచెరువు: స్థానిక నెహ్రూనగర్ ఉన్నత పాఠశాలలో పది రోజులుగా జరుగుతున్న యోగా తరగతులు శనివారం ముగిశాయి. వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి బళ్లా సత్యవతి, శ్రీనివాస్ ముఖ్యఅతిథులుగా పాల్గొని యోగాలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. బళ్లా సత్యవతి మాట్లాడుతూ పది రోజుల పాటు నేర్చుకున్న సూర్యనమస్కారాలు, యోగాను ఇంటి వద్ద సాధన చేయాలన్నారు. అనంతరం యోగా గురువు తీడా రామును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం కేవీవీ సత్యనారాయణ, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ నివాస స్థలాలు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- వెలుగుబందలో భూముల పరిశీలన



వెలుగుబందలో సేకరించిన భూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: నియోజకవర్గంలో అర్హత ఉన్న వారందరికీ నివాస స్థలాలను అందజేస్తామని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఇందులో భాగంగా మండలంలోని వెలుగుబందలో సేకరించిన భూములను శనివారం పరిశీలించారు. ఇప్పటికే దాదాపుగా అన్ని గ్రామాలలో నివాస స్థలాల పంపిణీ జరిగిందన్నారు. అయితే కొన్నిచోట్ల కోర్టు కేసుల మూలంగా కొంత జాప్యం జరుగుతోందన్నారు. వెలుగుబంద, దివాన్ చెరువు, లాలాచెరువులో నెలకొన్న ఈ సమస్యను త్వరగానే పరిష్కరించి, నివాస స్థలాల పంపిణీ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఈ విషయమై ఎటువంటి ఆందోళన చెందవద్దన్నారు. ఎమ్మెల్యే వెంట సంబంధిత శాఖల అధికారులు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

ఆరుగురికి కుక్కకాటు

సీతానగరం: రాపాక పంచాయతీ పరిధిలోని శ్రీరామ నగరంలో శనివారం సాయంత్రం పిచ్చి కుక్క స్వైరవిహారం చేసింది. ఆ ప్రాంతానికి చెందిన మార్ని నాగ వెంకటేష్, బావిశెట్టి నారాయణమ్మ, శ్రీమంతుల రత్నాజీతో పాటూ మరో ముగ్గురిపై దాడి చేసి గాయపరిచింది. బాధితులకు సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేశారు.

అద్దెకు వస్తాడు.. దోచుకుపోతాడు

- పోలీసులకు చిక్కిన దొంగ
- తెనాలి, విశాఖపట్నంలోనూ అతడిపై కేసులు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ నాగదుర్గాప్రసాద్

కడియం: అతడు ప్రతి రెండుమూడు నెలలకు ఒక్కో ప్రాంతాన్ని మారుస్తాడు. అద్దెకు అంటూ ఇంట్లో చేరతాడు.. ఆ తరువాత ఇల్లు మొత్తం దోచేస్తాడు. ఇలా పలు దొంగతనాలకు పాల్పడిన పెరవలి మండలం ఖండవల్లికి చెందిన పల్లెపు విజయ్ కుమార్‌ను కడియం పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్సై బి.నాగదుర్గాప్రసాద్ స్థానిక విలేకరులకు వివరాలు వెల్లడించారు. కడియం మండలం వేమగిరికి చెందిన దొడ్డ ఉమా పార్వతి బంధువుల ఇంట్లో విజయ్ కుమార్ అద్దెకు దిగాడు. ఉమా పార్వతితో పాటు, చుట్టుపక్కల వారితో పరిచయం పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఉమా పార్వతి ఇంట్లో నుంచి సుమారు రూ.రెండు లక్షల విలువైన బంగారు చైన్‌ను చోరీ చేశాడు. దీంతో ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో రాజమహేంద్రవరం నల్లమందు సందులో అనుమానాస్పదంగా తిరుగుతున్న విజయ్ కుమార్‌ను శనివారం అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. దీంతో అతడిని కోర్టుకు తరలించగా, రిమాండు విధించారు. కాగా.. విజయ్ కుమార్‌పై తెనాలి, విశాఖపట్టణం తదితర ప్రాంతాల్లో పలు చోరీ కేసులు నమోదయ్యాయని ఎస్సై నాగదుర్గాప్రసాద్ తెలిపారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి
- సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలనే సంకల్పంతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆరుగురికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 5.37 లక్షలకు సంబంధించిన చెక్కులను రాజమహేంద్రవరం ప్రకాశం నగర్‌లోని స్వగృహంలో శనివారం పంపిణీ చేశారు. మరో ఐదుగురికి రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా గతంలో 1,059 రోగాలకు చికిత్స పొందడానికి మాత్రమే అవకాశం ఉండేదని, దానిని ప్రస్తుతం 3,254 వరకూ పెంచారన్నారు. అలాగే సాయాన్ని రూ.25 లక్షలకు పెంచారన్నారు. అయితే ఈ విధంగా కూడా అవకాశం పొందలేని వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయాన్ని అందిస్తున్నారన్నారు.